# ముప్పది ఐదవ ప్రసంగము

1018

శ్రీ నిత్యానందస్వామివారి అనారోగ్యమునంగతి శ్రీప్రకాశానందస్వామివారికి అందెను. వారు వెంటనే పీరడియా వెళ్ళిరి. వారిని చూచుటతోడనే శ్రీనిత్యానందస్వామివారు హర్షాశ్రువులను వెలువరించిరి.

వారి అనారోగ్యము తీవ్రముగా నుండెను. మాట్లాడుశక్తి లేదు. వారు చెప్పిరి.

"ఈశరీరము క్షణభంగురము. ఇది పతనమగునను విచారము నాకేమి లేదు. ఈశరీరము ఉన్నచో స్వామిని భజించగలను. లేనిచో గోవింద గోవింద."

ఆసమయమున ప్రాణజీవనభాయి, మూళశంకరభాయి మొదలగు భక్తులు స్వామివారిసేవకు వేచియుండిరి. ఇదిచూచి స్వామివారు ఇట్లనిరి:—"మీరు అందరు ఎందుకు నాకొరకు ఇంతబాధ పడుచున్నారు? రాత్రింపగళ్ళు వేచియేయున్నారు."

స్వా. ప్ర. :—పరమాత్ముడు వీరికి తమసేవచేయు అవకాశము ఇచ్చెను. అది వారు తమఅదృష్టముగా తలచుచున్నారు.

ఈవిధముగా రెండుమూడురోజులు గడచినతరువాత వారు శ్రీప్రకాశానందులవారిని తమదగ్గరకు పిలచి చెప్పిరి.

"తమయందు నాకు పూజ్యభావముకలదు. ఒకవిషయము నివేదించుకొనుచున్నాను. అనారోగ్యము తీవ్రతరమాగుచున్నందున ఈశరీరము ఇక నిలబడదు అని తోచుచున్నది. ఎప్పుడో ఒకప్పుడు కూలిపోవును. అందుకు నేనేమియు బాధపడుటలేదు. కాని ఈశరీరమును హరిద్వారమున త్యజించవలెనని నాఉద్దేశ్యము."

ఈమాటలు విని ప్రకాశానందులవారు అడిగిరి :—

స్వామి! ఇదేమిటి?

ధర్మరాజు భక్తవరుడగు విదురునితో చెప్పెను:—

*భవద్విధా భాగవతాస్తీర్థీభూతాః స్వయం ప్రభో ।*
*తీర్థీకుర్వన్తి తీర్థాని స్వాన్తఃస్థేన గదాభృతా॥*

తమవంటి భగవద్భక్తులు తీర్థస్వరూపులు. పాపాత్ములచే కలుషితములగు తీర్థములను తమరు తమహృదయమునందున్న గదాధరుని ప్రభావముచే మరల పవిత్రముచేసి తీర్థత్వమును కలుగజేయుచున్నారు. గంగాది పుణ్యతీర్థములు తమచరణములయందు కలవు. తమరు ఈకోర్కెను విరమించుకొనుడు.

## జీవన్ముక్తుని విదేహముక్తి.

అంతట వారు హరిద్వారము వెళ్ళవలెనను సంకల్పమును విడనాడిరి. ఫాల్గుణశుద్ధ పూర్ణిమరోజున ఆయన అష్టపురీపరిత్యాగముచేసి స్వరూపమునందు లీనులైరి. వారు పూర్వమునుండియు జీవన్ముక్తావస్థయందే యుండిరి. ఇప్పుడు విదేహముక్తులైరి.

*స్వరూపోఽసౌ మనోనాశో జీవన్ముక్తస్య విద్యతే ।*
*అరూపస్తు మనోనాశో వైదేహీముక్తిగో భవేత్॥*

"జీవన్ముక్తుని మనోనాశము సరూపనాశము. విదేహముక్తి అను మనోనాశము అరూపమనోనాశము.

చిత్తనాశము రెండు రకములు. 1. సరూపము 2. అరూపము. జీవన్ముక్తియందు సరూపనాశము కలదు. విదేహముక్తియందు అరూపనాశము కలదు. ఎట్లనిన— ధాన్యమును నిలువచేయుటచే అందలి బీజశక్తి నశించును. అది సరూపనాశము. ఆధాన్యమునే భుజించుటచే కలుగు రూపాంతరము అరూపనాశము.

సరూపమనోనాశమునందు జీవన్ముక్తుడగును. స్వస్వరూపమగు అఖండబ్రహ్మముయొక్క జ్ఞానముద్వారా బ్రహ్మప్రాప్త్యావరణము

లగు అజ్ఞానము, దానికార్యములగు సంచితకర్మలు, సంశయవిపర్యయాదులును బాధితములగుటచే స్వస్వరూపాఖండబ్రహ్మసాక్షాత్కారము జరిగి అవిద్యాబంధములయొక్క, దానికార్యములయొక్కయు రాహిత్యమును పొందుట జీవన్ముక్తత్వము.

గురువుద్వారా, శ్రుత్యుపదేశముద్వారా, స్వానుభవము ద్వారా, జీవబ్రహ్మల ఏకత్వ-అభేదజ్ఞానము కలుగుటచే జీవుని ఆశ్రయమున ఉన్న మూలావిద్యయు, దాని అజ్ఞానకార్యములగు సంచిత కర్మలు, సంశయాదులును బాధించబడుటచే సర్వబంధరహితుడగుట జీవన్ముక్తావస్థ.

ఈవిషయమున శ్రుతిని వినుడు:—

*భిద్యతే హృదయగ్రన్థిః ఛిద్యన్తే సర్వసంశయాః ।*
*క్షీయన్తే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే॥*

పరావరము అనగా సర్వోత్కృష్టము, సర్వోపాధిరహితము అగు వ్యాపకబ్రహ్మము. అది తెలియుటచే జీవన్ముక్తపురుషుని హృదయమునందలి అవిద్యాగ్రంధి (ముడి) విడువడును. సకలసంశయములును, సంచితాది సర్వకర్మములును బ్రహ్మసాక్షాత్కారము అగుటచే లయమును పొందును.

పరావరశబ్దమునకు సర్వాత్మకబ్రహ్మము అని అర్థము. అంతకంటె పైవాడు లేనివాడు అని అర్థము. హిరణ్యాగర్భుడుకూడ ఎవనికంటె న్యూనమో అట్టి సర్వవ్యాపకమగు బ్రహ్మసాక్షాత్కారము జరుగుటచే జీవన్ముక్తుని కర్మలు అన్నియు లయమును పొందును.

అరూపమనోనాశముచే విదేహముక్తి కలుగును. అరూపనాశము అనగా కార్యమునందు కారణము లయమగుట.

ముక్తి అనగా సకలదుఃఖములనుండియును విడుదలపొంది పరమానందమును పొందుట. ప్రతిప్రాణికిని గొప్పదుఃఖము మృత్యువు. దానినుండి విడుదలపొందమని శ్రుతి చెప్పుచున్నది:—

అరా ఇవ రథనాభౌ కలా యస్మిన్ ప్రతిష్ఠితాః।
తం వేద్యం పురుషం వేద యథా మా వో మృత్యుః పరివ్యథా ఇతి॥

రథనాభియందు రథచక్రపు ఆకులు చేరియున్నట్లు పురుషుని ఉత్పత్తి, స్థితి, లయకాలములయందు ప్రాణములు ప్రతిష్ఠించబడియుండును. ఓశిష్యా, ఆకళాధారుడగు పురుషుని నావచనములచే తెలిసికొనుము. అట్లు చేయుటచే మృత్యువు- అనగా విపరీతజ్ఞానము నిన్ను బాధించదు. స్వరూపజ్ఞానమునందు ఆవరణము కాదు.

ప్రాణాది షోడశకళలగురించియు ప్రశ్నోపనిషత్తునందు చెప్పబడినది:—

స ప్రాణమసృజత ప్రాణాచ్ఛ్రద్ధాం ఖం వాయుర్జ్యోతిరాపః
పృథివీన్ద్రియం మనః।
అన్నమన్నాద్వీర్యం తపో మన్త్రాః కర్మలోకాః లోకేషు చ నామ చ॥

ఆఆత్మ షోడశకళలకు ప్రధానమగు ప్రాణమును మొదట సృష్టించెను. ప్రాణమునుండి శ్రద్ధ, ఆకాశము వాయువు, అగ్ని, జలము, భూమి, దశేంద్రియములు, మనస్సు అన్నము, అన్నభక్షణముచే సర్వకర్మలయందును ప్రవృత్తిని కలిగించు బలము—సామర్థ్యము వీర్యము వీనిని ఉత్పత్తి చేసెను. అటులనే తపము, మంత్రరూపములగు వేదములు, కర్మలు, కర్మఫలములగు లోకములు లోకములందలి ప్రాణులనామములు, మనుష్యులు, పశువులు, పక్షులు మొదలగువానిని ఉద్భవింపజేసెను. ఈవిధమున 16 కళలను సృష్టించెను.

షోడశకళలనుగురించియును శ్వేతాశ్వతర ఉపనిషత్తుకూడ చెప్పుచున్నది. అందు పృథివ్యాదిపంచభూతములు, పంచజ్ఞానేంద్రియములు పంచకర్మేంద్రియములు, మనస్సు కలిసి 16 కళలని వ్యష్టిరూపమున చెప్పబడినవి. వేరొకవిధమున విరాట్టు, సూత్రాత్మ అను భేదములచే, సమష్టిరూపమున 16 కళలును, భూరాది 14 లోకముల భేదముచే వ్యష్టిరూపమున 16 కళలును చెప్పబడినవి.

పురుషుడు ఈపదహారుకళలకును భిన్నుడు. ఆతనిని తెలిసికొ నినవాడు మృత్యుపీడనుండి ముక్తుడగును. ఈపురుషుని పరికించవల సిన సాధనములను గురించి శ్రుతి చెప్పుచున్నది.

*అరా ఇవ రథనాభౌ సంహతా యత్ర నాడ్యః స ఏషోఽన్తశ్చరతే బహుధా జాయమానః।*

*ఓమిత్యేవం ధ్యాయథ ఆత్మానం స్వస్తి వః పారాయ తమసః పరాస్తాత్॥*

రథనాభియందు చక్రపుఆకులు కలసియున్నట్లు హృదయమున వేలకొలదినాడులు కలిసియుండును. ఆహృదయమధ్యభాగమున ప్రకృతమగు ఆత్మకూడ ఉండును. అది అనేకవిధములుగ క్రోధ హర్షాదిరూపమున ప్రతీయమానమగును. ఎట్లనిన ఘటముయొక్క ఉత్పత్తిద్వారా ఘటాకాశము ఘటరూపమగు ఉత్పత్తిచే జన్మించును. 'ఓశిష్య! నీవు ఈనశ్వరముకాని ఆత్మను ప్రణవముద్వారా, ప్రణవరూపమున ధ్యానము చేయుము.' నా ఆశీర్వాదముచే మృత్యు జన్యమగు దుఃఖమునకు కారణమగు అవిద్యనుండి విడువడుటకు నీకు నిర్విఘ్నముగా కళ్యాణమగుగాక!

ఈవిధముగా అన్ని కళలనుండి ముక్తులయిన విదేహముక్తి యందు పరమాత్మునితో అభేదమును పొందనగును.

ఈవిషయమున శ్రుతిని పరికింపుడు.

*గతాః కలాః పఞ్చదశ ప్రతిష్ఠా దేవాశ్చ సర్వే ప్రతిదేవతాసు।*
*కర్మాణి విజ్ఞానమయశ్చ ఆత్మా పరేఽవ్యయే సర్వ ఏకీభవన్తి॥*

మోక్షకాలమున దేహమును ఉద్భవింపజేయు కళలన్నియును తమతమ కారణమున లయమును పొందును. దేహాశ్రితములగు చక్షురాదులయందు ఉన్న దేవులు ఆదిత్యాదిదేవతలయందు లయ మును పొందును. అటులనే కర్మలును, విజ్ఞానమయ ఆత్మయును

వ్యాపకమును, అనంతమును, అవ్యయమును, అజరమును, అమృత రూపమును అగు బ్రహ్మమునందు లయమును పొందును.

ఈవిధముగా జ్ఞాని పుర్యష్టకమును పరిత్యజించి బ్రహ్మైక్యమును పొందును. ముండకోపనిషత్తు చూడుడు:—

యథా నద్యః స్యన్దమానాః సముద్రేఽస్తం గచ్ఛన్తినా మరూపేవిహాయ।
తథా విద్వాన్నామరూపాద్విముక్తః పరాత్పరం పురుషముపైతి దివ్యమ్॥

గంగాదినదులు ప్రవహించి, ప్రవహించి తమ నామరూపములను విసర్జించి సముద్రమున లయమును పొందును. అటులనే విద్వాంసుడు అనగా జ్ఞాని నామరూపవిముక్తుడయి ఉత్కృష్టము, దివ్యప్రకాశరూపము పూర్ణపురుషుడును అగు బ్రహ్మము అగును. అనగా బ్రహ్మమునందు లయమును పొందును.

సూర్యుడు కిరణములద్వారా సముద్రజలమును ఆకర్షించును. ఆజలము మేఘరూపమున వర్షించి భూమిపై పడును. అది గంగా యమునాది నదీరూపములనుపొంది సముద్రముతో మరల ఏకత్వమును పొందును. అటులనే మాయాసంబంధముతోనున్న జీవాత్మ వెనుకటి స్వరూపముయొక్క జ్ఞానమునుపొంది మాయాపరుడగు మూలపురుషుడగు పరబ్రహ్మమును పొందును,

బృహదారణ్యకము చెప్పుచున్నది.

('న తస్య ప్రాణా ఉత్క్రామన్తి' 'బ్రహ్మైవ సన్ బ్రహ్మాప్యేతి।')

ఆబ్రహ్మవేత్తయొక్క ప్రాణములు పైకిపోవు. అవిబ్రహ్మము అయి బ్రహ్మమునందు లీనమగును.

(ఓం శాన్తిః శాన్తిః శాన్తిః)